### నేడు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ముషీరాబాద్, డిసెంబర్ 19: రోటరీ క్లబ్ హైదరాబాద్ ఈస్ట్, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం (నేడు) మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ నాయకుడు రాజా దీన్‌దయాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చేపల మార్కెట్‌లోని గంగపుత్ర సంఘం కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభిస్తారని తెలిపారు. మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఉచిత శిక్షణకు దరఖాస్తులు

అమీర్‌పేట్, డిసెంబర్ 19: టెక్ మహీంద్ర ఫౌండేషన్ డిజిటల్ అకాడమీలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూస్) క్లౌడ్ ప్రాక్టీస్ కార్యక్రమంలో భాగంగా ఉచిత శిక్షణ, సర్టిఫికేషన్, ప్లేస్‌మెంట్ సహకారాన్ని అందిస్తోంది. ఉచిత శిక్షణ పొందేందుకు బీఈ, బీటెక్, బీఎస్సీ కంప్యూటర్స్ (2022-23-24) సంవత్సరాల్లో పూర్తి చేసిన వారు అర్హులని, అభ్యర్థుల ఎంపిక ప్రవేశ పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూ ఆధారంగా ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు టెక్ మహీంద్ర ఫౌండేషన్, ఖాక్ టవర్ సమీపంలోని సెలెక్షన్ రోడ్, మెట్రో పిల్లర్ నంబర్ 941 సమీపంలోని ఓక్రీ టవర్స్‌లో 73373 32605లో సంప్రదించాలని కోరుతున్నారు.

### నేటి చలో అసెంబ్లీకి తరలిరండి

సికింద్రాబాద్, డిసెంబర్ 19: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆటో యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ ఉమర్‌ఖాన్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం నుంచి భారీ ప్రదర్శన ర్యాలీ ఉంటుందన్నారు. ర్యాలీకి వేలాది ఆటో డ్రైవర్లు తరలి రావాలని కోరారు. రాష్ట్ర నలుమూలల నుంచి ఆటో డ్రైవర్లు తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# అమిత్‌షా వ్యాఖ్యలపై ఆగ్రహ జ్వాల

**అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసన**
**కేంద్ర హోంమంత్రి దిష్టిబొమ్మల దహనం**
**క్షమాపణ చెప్పాలని పలు సంఘాల డిమాండ్**



ఆర్ట్స్ కళాశాల ఆవరణలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం అనంతరం నినాదాలు చేస్తున్న విద్యార్థి నాయకులు



సీతాఫల్‌మండి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు



అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి నినదిస్తున్న విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 19: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై విద్యార్థి లోకం భగ్గుమంది. ఉస్మానియా యూనివర్సిటీలో వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా అమిత్ షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. ర్యాలీ నిర్వహించి, లా కళాశాల ఆవరణలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రమంత్రి వర్గం నుంచి అమిత్ షాను వెంటనే తప్పించాలని డిమాండ్ చేశారు. షా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని సూచించారు. రాజ్యాంగాన్ని రక్షించడం కోసం దేశ ప్రజలందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమాలలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**బాబాసాహెబ్‌ను అవమానిస్తే సహించం**

సికింద్రాబాద్: కేంద్ర హోంశాఖ మంత్రి భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో సీతాఫల్‌మండి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట గురువారం నిరసన తెలిపారు. సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ మూలవాసులను మతం పేరుతో వేల ఏండ్లుగా దోపిడీకి గురి చేస్తున్నా.. మనువాదుల నుంచి కాపాడడానికి ఏ దేవుడు కూడా రాలేదని అన్నారు. అణచివేతకు, దోపిడీకి గురవుతున్న దేశ వాసులకు బాబాసాహెబ్ భారత రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించి మనువాదుల దోపిడీ, పీడనల నుంచి విముక్తి కల్పించిన మహానుభావుడు అంబేద్కర్ అని అన్నారు. అంతటి సమున్నత వ్యక్తిని కేంద్ర మంత్రే అవమానించేలా మాట్లాడటం క్షమించరానిదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమురెల్లి బాబు, జోగు రాములు, రమేశ్, శ్రీహరి, తోకల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**అడ్డగుట్ట:** నిండు పార్లమెంటులో అంబేద్కర్‌ను అవమానించడాన్ని నిరసిస్తూ డీబీఎఫ్ ఆధ్వర్యంలో తుకారాంగేట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన మాట్లాడుతూ అంబేద్కర్ అనే పదం ఫ్యాషన్‌గా మారిందని, అంబేద్కర్‌కు బదులు దేవుళ్లను స్మరిస్తే స్వర్గలోక ప్రాప్తి లభిస్తుందని అంబేద్కర్‌ను అవమానించడం తగదని అన్నారు. వెంటనే అమిత్‌షా బహిరంగ క్షమాపణలను చెప్పి కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు ఉమక్క, ఉపేందర్, ఐశ్వర్య, భవాని, శోభ, స్వప్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**బన్సీలాల్‌పేట్:** బీఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యానించిన కేంద్ర హోంమంత్రి దేశ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు ఆయన దిబొమ్మను దహనం చేశారు. అనంతరం పోలీసులు వారిని అరెస్టు చేసి గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## కృష్ణస్వామి వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి



జేబీఎస్ వద్ద కృష్ణస్వామి విగ్రహానికి నివాలర్పిస్తున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షుడు పిట్ల నాగేశ్‌ముదిరాజ్, తదితరులు

మారేడ్‌పల్లి, డిసెంబర్ 19: నగర మొదటి మేయర్ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ వర్ధంతిని జూబ్లీబస్టాండ్ చౌరస్తాలో కొర్వి కృష్ణస్వామి సేవా సమితి అధ్యక్షుడు పిట్ల నాగేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ముదిరాజ్ హాజరై కృష్ణస్వామి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొర్వి కృష్ణస్వామి చేసిన సేవలతోనే హైదరాబాద్‌కు విశ్వనగర అభివృద్ధికి బాటలు వేశారని అన్నారు. ఆయన అడుగు జాడల్లో యువత నడవాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్‌లు ఎంతోమంది వెనుకబడి ఉన్నారని.. రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణస్వామి జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వేణుగోపాల్, అశోక్, సత్యం, లక్ష్మణ్, శ్రీనివాస్, వీరమణి, యాదగిరి, సైదులు, కృష్ణ, కార్పొరేటర్ సామల హేమ తదితరులు పాల్గొన్నారు.

**సంస్కరణలకు శ్రీకారం చుట్టిన నేత**

సికింద్రాబాద్: నగర తొలి మేయర్‌గా కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ తన పాలనా కాలంలో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ అన్నారు. వారాసిగూడ శివాజీ విగ్రహం వద్ద కృష్ణస్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జూబ్లీ బస్టాండ్ దగ్గర ఉన్న ఆయన విగ్రహానికి కార్పొరేటర్ హేమ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆకార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు మేకల సారంగపాణి, యాదగిరి, నగేశ్, గణేశ్, అశోక్, అజయ్ పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు తప్పవు



ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య సిబ్బంది

బేగంపేట్, డిసెంబర్ 19: బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేసినా, వాహన రాకపోకలకు అడ్డంకి కలిగించినా ఉపేక్షించేది లేదని బేగంపేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య హెచ్చరించారు. మినిస్టర్ రోడ్డులోని గల్ఫ్ బేకరీ ముందు ఫుట్‌పాత్ ఆక్రమణలను గురువారం పూర్తిస్థాయిలో తొలగించారు. ప్రస్తుతం అక్కడ పాదాచారులు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు. కొంతకాలంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి పూర్తిస్థాయిలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించేందుకు కృషి చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించకుండా ప్రతిరోజు మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు.

## క్రిస్మస్ పురస్కరించుకుని చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, డిసెంబర్ 19: గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లిలోని మహిళా సంఘం కమ్యూనిటీ హాల్లో జీహెచ్‌ఎంసీ సిబ్బంది అలివేలు ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా చీరల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహాతో కలిసి కేక్ కట్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళలకు చీరలును పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు బీఎన్ రమేశ్ మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాస్టర్లు ప్రమోద్, హరిబాబు, యేసురత్నం, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్, నాయకులు పున్న సత్యనారాయన్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, పాశం రవి, శ్రీకాంత్, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు లాజర్‌మాదిగ, సీపీ డానియల్, గోపి పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి పడి పూజ



పడి పూజలో పాల్గొన్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు, కార్పొరేటర్లు, నాయకులు

సికింద్రాబాద్, డిసెంబర్ 19: సికింద్రాబాద్‌లో అయ్యప్ప స్వామి పడి పూజ ఘనంగ జరిగింది. భక్తి పాటలతో ఆ ప్రాంతం మార్మోగింది. సీతాఫల్‌మండికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గరికపాటి చంద్రశేఖర్ గురువారం సీతాఫల్‌మండి మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్‌లో పడి పూజ కనుల పండువగా నిర్వహించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావుగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు హేమ, శైలజ, సునీత, యువ నాయకులు తీగుళ్ళ రామేశ్వర్‌గౌడ్, త్రినేత్ర గౌడ్, నేతలు కంది నారాయణ, కరాటే రాజు, ప్రముఖులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ప్రమాదకర చెట్ల తొలగింపు



ప్రభుత్వ పాఠశాలలో చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

బేగంపేట్, డిసెంబర్ 19: రాంగోపాల్‌పేట్ డివిజన్ సుభాష్‌రోడ్డులో ఉన్న నాగెల్లి దుర్గయ్య ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని స్థానిక ఎంఐఎం నాయకుడు అశోక్ తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో భవనంపై ప్రమాదకరంగా ఒరిగిన వృక్షాలను హార్టికల్చర్ అధికారులతో మాట్లాడి ప్రమాదకర స్థితిలో ఉన్న వృక్షాలను తొలగించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎంపీ నిధుల మంజూరు ప్రక్రియ కొనసాగుతుందని అందులో భాగంగా చెట్లను తొలగించినట్టు తెలిపారు. పదిరోజుల్లో భవనానికి రంగులు, మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందని ఆయన చెప్పారు.

## కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు



సీఈఓ, సూపరింటెండెంట్‌ను కలిసిన యూనియన్ అధ్యక్షుడు ఎం.నరసింహ, సిబ్బంది

బొల్లారం, డిసెంబర్ 19: కంటోన్మెంట్ బోర్డుకు స్వచ్ఛ అవార్డు రావడం కార్మికుల శ్రమకు నిదర్శమని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం.నరసింహ అన్నారు. గురువారం బోర్డు కార్యాలయంలో సీఈఓ మధుకర్‌నాయక్, హెల్త్ సూపరిండెంట్ దేవేందర్‌ను కార్మికులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, వారికి రావాల్సిన బోనస్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బోర్డు కాంట్రాక్ట్ సూపర్‌వైజర్లు వెంకటస్వామి, నాగేశ్, దస్తగిరి, ధనుంజయ్, రవి, కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు చిన్నారులకు వినికిడి యంత్రాల అందజేత

బన్సీలాల్‌పేట్: పద్మారావునగర్‌లోని సిటీ సెంటర్ కేంద్రంలో గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ కంటోన్మెంట్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో ఇద్దరు చిన్నారులకు మీనాక్షి వెంకటరామన్ ఫౌండేషన్ (ఎంవీఎఫ్) మేనేజింగ్ ట్రస్టీ సేతురామన్ ఆధ్వర్యంలో డిజిటల్ వినికిడి యంత్రాలను అందజేశారు. రోటరీ క్లబ్ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్‌చౌదరి, సహాయ గవర్నర్ బిబో శ్రీనివాస్, రమణి, రోటరీ క్లబ్ ఆఫ్ కంటోన్మెంట్ సికింద్రాబాద్ అధ్యక్షురాలు మంజు, కార్యదర్శి వెంకట్ ఆచార్య, కమ్యూనిటీ డైరెక్టర్ ఎస్.రామచంద్ర, సుబ్బరాజ్, ఎంవీఎఫ్ ట్రస్టీలు వసంత, కృష్ణన్, డైరెక్టర్లు డాక్టర్ రంగనాథన్, ప్రసాద్‌రావు, మురళీ నటరాజన్ పాల్గొన్నారు.

## గౌడ్‌ల అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దాం

చిక్కడపల్లి, డిసెంబర్ 19: తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్ గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో ఉన్న కల్లుగీత, గౌడ స్థితిగుతులపై మంత్రితో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రాంతాలు వేరుగా ఉన్న గౌడ జాతీ కోసం కలిసి పనిచేద్దామని అన్నారు.

### పీజీఆర్‌ఆర్‌సీడీఈ జేడీలకు సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 19: ఓయూ దూరవిద్యాకేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్‌ఆర్‌సీడీఈ) జాయింట్ డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సోమేశ్ పోల, ప్రొఫెసర్ నాగరాజును అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దూరవిద్యను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్, ప్రొఫెసర్ రాజేశ్‌కుమార్, ప్రొఫెసర్ ఎన్.కిషన్, డాక్టర్ మురళీధర్‌రెడ్డి, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ సుమన్, డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఇండ్ల దరఖాస్తుల పరిశీలన

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 19: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో సొంత ఇండ్లులేని ప్రజలు చేసుకున్న దరఖాస్తులను రాష్ట్ర హౌసింగ్ శాఖ ఎస్ఈ, జిల్లా నోడల్ అధికారి మెట్టు వెంకట్‌దాస్‌రెడ్డి పరిశీలించారు. గురువారం ఆయన బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో ఈనెల 17 నుంచి జీహెచ్‌ఎంసీ సిబ్బంది బృందాలుగా ఇంటింటికీ దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేస్తున్నారు? ఏఏ అంశాలను గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బేగంపేట్ సర్కిల్ డీసీ సమ్మయ్య, నోడల్ అధికారి ఏఎంసీ కిరణ్‌రెడ్డి ఉన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలో 9,200 మంది తమకు ఇండ్లు కావాలని దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందు కోసం ఫోన్లలో హౌసింగ్ శాఖ యాప్‌ను రూపొందించిందని, తమ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వారి వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేస్తున్నారని డీసీ తెలిపారు. కార్పొరేటర్ కె.హేమలత, బీఆర్‌ఎస్ నాయకులు కె.లక్ష్మీపతి వారి వెంట ఉన్నారు.

### ఎల్లయ్యకు సేవా భూషణ్ పురస్కారం

చిక్కడపల్లి, డిసెంబర్ 19: ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ 19 వార్షికోత్సవం సందర్భంగా బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవా స్వర్ణ నంది, సేవా భూషణ్, ఉపాధ్యాయ రత్న నేషనల్ అవార్డుల ప్రదానోత్సవం గురువారం నిర్వహించారు. దళిత కల్యాణ వేదిక అధ్యక్షుడు రేణిగుంట ఎల్లయ్యకు 2024కి గాను సేవా భూషన్ పురస్కారాన్ని అందజేశారు. విశ్రాంత న్యాయమూర్తి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఎల్లయ్య మాట్లాడుతూ వేదిక ఆధ్వర్యంలో అన్ని కులాలు, వర్గాల వారికి ఇప్పటి వరకు 5616 వివాహాలు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఈఎస్ఎస్ నారాయణ పాల్గొన్నారు.

# రేవంత్‌ను గెలిపించినందుకు మాలలకు శాపం



మాల సంఘాల జేఏసీ కన్వీనర్ మాందాల భాస్కర్, డాక్టర్ అంగరి ప్రదీప్, మాదాసు రాహుల్, తదితర నాయకులు



చిక్కడపల్లి పోలీస్ స్టేషనల్‌లో మాలల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కరణం కిషన్, తదితరులు

చిక్కడపల్లి, డిసెంబర్ 19: రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ సర్కాను గెలిపించినందుకు మాలలకు శాపంగా మారిందని జాతీయ మాలల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కరణం కిషన్ మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ రావడానికి మాలలు ఎంతో కృషి చేశారని, కానీ ఇప్పుడు తమకే అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపు మేరకు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కరుణం కిషన్ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి బయలుదేరారు. దీంతో పోలీసు అరెస్టు చేసిన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా పోలీస్ట్ స్టేషన్ ఆవరణలో కిషన్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ విషయంలో మాదిగలకు వత్తాసు పలకడం దారుణమని అన్నారు. వచ్చే పది రోజుల్లో వకర్గీకరణ చేస్తామని సీఎం చెప్పడం సరికాదన్నారు. కిషన్‌తో పాటు నాయకులు గుడిమల్ల వినోద్, ఆవుల సుధీర్, పంబాల రాజు, గడ్డం వినయ్, సల్ల పవన్, కరణం నాగేశ్వర్‌రావులను కూడా అరెస్టు చేశారు.

## సమస్యలపై శాశ్వత పరిష్కారానికి చర్యలు



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, డిసెంబర్ 19: డివిజన్ పరిధిలో డ్రైనేజీ సమస్యను శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అన్నారు. వారాసిగూడ శివాజీ విగ్రహం దగ్గర, బ్రాహ్మణ బస్తీలోకి వెళ్లే దారిలో ప్రతిరోజు మురుగు నీరు నిరంతరంగా పొంగి పొర్లుతోందని స్థానికులు సమస్యను కార్పొరేటర్ హేమ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆమె అధికారులతో కలిసి ఆప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలోనే పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ కుషాల్ తదితరులు పాల్గొన్నారు.

# వేతన సంఘం ఏర్పాటు కోసం పోరాడుతం

**ఏఐఆర్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా**



సమావేశంలో ఏఐఆర్‌ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివ గోపాల్ మిశ్రా, రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, యూనియన్ నాయకులు

మారేడ్‌పల్లి, డిసెంబర్ 19: రైల్వే ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేస్తున్నామని ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్ (ఏఐఆర్‌ఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా అన్నారు. ఇటీవల జరిగిన ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో సికింద్రాబాద్ జోన్‌లో మజ్దూర్ యూనియన్ అత్యధిక మెజార్టీతో గెలిచిన సందర్భంగా యూనియన్ కేంద్ర కార్యాలయం నుంచి రైల్ నిలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ అధ్యక్షతన రైల్‌నిలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి శివగోపాల్‌మిశ్రా తోపాటు సికింద్రాబాద్ జోన్ జీఎం అరుణ్‌కుమార్ జైన్, యూనియన్ జనరల్ సెక్రెటరీ సీహెచ్ శంకర్‌రావు హాజరయ్యారు. మిశ్రా మాట్లాడుతూ 8వ వేతన సంఘం అమలు చేసే వరకు పోరాటం చేస్తామని అన్నారు. అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఉదయభాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, భారటే, రామకృష్ణ, సరోజినీరెడ్డి, మురళీధర్, రవీందర్, కృష్ణ, సంజీవయ్య, బుచ్చిరెడ్డి, వరప్రసాద్, ఖాజబాబా, మంజులత, చిలుకు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# గొల్లకురుమలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



ధర్నాలో అభివాదం చేస్తున్న సంఘం ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్, తదితరులు

చిక్కడపల్లి, డిసెంబర్ 19: కాంగ్రెస్ ప్రభుత్వం గొల్లకురుమలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ అన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గొల్లకురుమలకు 2లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడుత గొర్రెల పంపిణీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి మోసం చేస్తున్నందుకు నిరసనగా ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో గురువారం ధర్నా నిర్వహించారు. రవీందర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో గొల్ల కురుమలకు 2లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని కాంగ్రెస్ మ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందన్నారు. కానీ ఏడాది గడుస్తున్నా గొర్రెలివ్వడం లేదని విమర్శించారు. బీసీ జనసభ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజారాంయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ కురుమ, యాదవులకు రాజకీయ ప్రాతినిధ్యం ఇవ్వడం లేదని విమర్శించారు. రాష్ట్ర ఫెడరేషన్‌కు ఇప్పటి వరకు కనీసం చైర్మన్‌ను కూడా నియమించకుండా నిర్లక్ష్య చేస్తున్నారని విమర్శించారు. దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షుడు కిల్లె గోపాల్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో వృత్తి సంఘాల రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ, యాదవ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మేకల కృష్ణయాదవ్, వివిధ వృత్తి సంఘాల నాయకులు మల్లేశం, జి.నాగరాజు, బి.అశోక్, లింగయ్య, ఎం.రాజు, అశోక్, లింగయ్య, యాదగిరి, మధుకర్, కొమురయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

**NOTICE**
**IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE, RAJANNA-SIRCILLA AT SIRCILLA**
A.S. No. 14 of 2024
Between:-
**Mudham Ravi** ...Appellant-plaintiff.
And
**Chitneni Rama Rao & others** ...Respondents/defendants
To,
**R2. Chitneni Prasad Rao,** S/o late Kantha Rao, aged 72 years, occ: Professor (AIRTED), Osmania University, Flat No. 311, Vishnu residency, Opp: Canara Bank, Gandhinagar, Musheerabad, Hyderabad 500178
Take notice that the above named appellant/plaintiff filed above appeal suit against you and above appeal suit is posted on: 10-1-2025 at 10-30 A.M. for your appearance.
So, you have to appear personally or through advocate on said date and time before the above court failing which case will be decided in your absence.
" By order of the court "
Sd/- **Kodam Satyanarayana,**
Advocate, Sircilla. Cell: 9396911441